క్లుప్తంగా

హెల్త్ ఉద్యోగుల క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ


వైద్య ఉద్యోగుల క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జేఏసీ ఆధ్వర్యంలో క్యాలెండర్లు, డైరీ సోమవారం ఆవిష్కరించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు శశిభూషణరావు, ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీహెచ్ నాగరాజు, ఇతర నాయకులు కిషోర్, రమణ, గోపీనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు ఔషధ మొక్కల పంపిణీ


అధ్యాపకులు, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఎంవీపీ కాలనీ: గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో ఆధ్వర్యంలో పండ్లు, ఔషధ మొక్కలు, పక్షులు గూళ్లు పెట్టుకునే మొక్కలను సోమవారం పంపిణీ చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని సంస్థ ఎకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం, మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని పలు విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులకు మొక్కలు అందజేశారు. ఏఎస్ రాజా జూనియర్ కళాశాల, వీఎంసీ డిగ్రీ కళాశాల, సమత డిగ్రీ, పీజీ కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహం పాల్గొన్నారు. గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శుభారంభ సంకీర్తనలు


సంకీర్తనలు ఆలపిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం బీచ్‌రోడ్డులోని శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద శుభారంభ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య మహా ప్రభు, నిత్యానంద మహా ప్రభులకు హారతి ఇచ్చారు. విద్యార్థుల నాటక ప్రదర్శన అలరించింది. అనంతరం హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ప్రవచనాలు సాగాయి.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఈపూజ నిర్వహించారు.

ఇది కదా అభివృద్ధి

పుస్తకాలయం.. పునరుజ్జీవం

- ఏయూ గ్రంథాలయానికి సరికొత్త సొబగులు
- రూ.75 లక్షలతో ఆధునికీకరణ
- తాళపత్రాల డిజిటలైజేషన్
- పరిశోధకులు, విద్యార్థుల హర్షం


నాడు : గతంలో కళావిహీనంగా గ్రంథాలయం


నేడు: సుందరంగా తీర్చిదిద్దిన గ్రంథాలయం

నాడు ఎంతో ఘన చరిత గల ఏయూలోని వీఎస్ కృష్ణా గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. టేబుల్స్, బుక్‌షెల్ఫ్ పాతబడిపోయాయి. భవనం చుట్టూ ఉన్న సన్‌షేడ్స్ బాగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల విరిగిపోగా.. మరికొన్ని చోట్ల భారీ మొక్కలు పెరిగిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. పార్కింగ్ ప్రాంతం సరిగ్గా లేదు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడేవారు.

నేడు దశాబ్దాలనాటి గ్రంథాలయాన్ని పునరుద్ధరించి, జీవం పోశారు. దెబ్బతిన్న సన్‌షేడ్స్‌ను తొలగించి కొత్తవాటిని నిర్మిస్తున్నారు. భవనం పై అంతస్తులో రూఫ్ ట్రీట్‌మెంట్, అధునాతన కెమికల్ టెక్నాలజీతో పనులు చేస్తున్నారు. విద్యార్థులు చదువుకునే టేబుల్స్, బుక్ షెల్ఫ్‌లకు పాలిషింగ్, పెయింటింగ్ చేసి సుందరంగా తీర్చిదిద్దారు. తాళపత్రాల డిజిటలైజేషన్, ఈ లెర్నింగ్ సెంటర్‌లతో గ్రంథాలయం జవసత్వాలు పుంజుకుని దేదీప్యమానంగా వెలుగొందుతోంది.

గ్రంథాలయ మరమ్మతులు	డిజిటలైజేషన్ :
రూ.25 లక్షలు	రూ.50 లక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి గుండె వంటి వీఎస్ కృష్ణా గ్రంథాలయం కొత్త వైభవాన్ని సంతరించుకుంది.దాదాపు నాలుగు దశాబ్దాల తరువాత ఏయూ డాక్టర్ వి.ఎస్ కృష్ణా గ్రంథాలయానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు విద్యార్థులకు ఉపయుక్తంగా మౌలిక వసతులు కల్పించారు.

భవనానికి కొత్తశక్తి

ఏయూ గ్రంథాలయంలోని ఐదు అంతస్తులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశారు. ముందుగా భవనం చుట్టూ ప్లింత్ ప్రొటెక్షన్ చేశారు. భవనం చుట్టూ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనికారణంగా వర్షపు నీరు భవనంలోకి చేరే పరిస్థితి నుంచి పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా పనులు నిర్వహించారు. భవనం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం, కొత్తగా కార్, స్కూటర్ పార్కింగ్ ప్లేస్‌ను నిర్మించారు. పార్కులో మొక్కలకు పశువుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫెన్సింగ్ వేశారు. విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు వేసి, భవనం చుట్టూ ఉన్న కిటికీలు, తలుపులు మార్పు చేశారు.


దివ్యాంగుల కోసం నిర్మించిన ప్రత్యేక మార్గం (రెయిలింగ్)


పార్కింగ్ స్థలం

సివిల్స్ అభ్యర్థుల కోసం ఏసీ రీడింగ్ రూమ్

భవనం సెల్లార్‌లో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న ఐదు వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల హాల్‌ను ఏసీ రీడింగ్ రూమ్‌గా తీర్చిదిద్దుతున్నారు. సివిల్స్‌కు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా ఒక ప్రవేశ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్తులో వర్సిటీ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ రంగంలో ఉన్నత స్థానాలలో స్థిరపడటానికి ఈ కేంద్రం ఉపయుక్తంగా నిలపాలని ఏయూ పాలకులు పనిచేస్తున్నారు.

మెరుస్తున్న ఫర్నిచర్ : విద్యార్థులు చదువుకునే టేబుల్స్, బుక్ షెల్ఫ్‌లు పూర్తిస్థాయిలో పాలిషింగ్, పెయింటింగ్ చేసి సుందరంగా తీర్చిదిద్దారు. దశాబ్దాల క్రితం తయారు చేసిన టేకు ఫర్నిచర్ కొత్తవాటిలా మెరిసే విధంగా పాలిషింగ్ చేసి అందుబాటులో తీసుకువస్తూ, అవసరమైన వాటికి మరమ్మత్తులు సైతం పూర్తిచేసారు.. పుస్తకాలు ఉంచే షెల్ఫ్‌లను విభాగాల వారీగా పెయింటింగ్ పనులు నిర్వహించారు

ఒక్క క్లిక్‌తో కంప్యూటర్ జర్నల్స్

దశాబ్దాలుగా ఏయూలో భద్రపరిచిన వేలాది తాళపత్రాలను డిజిటలైజ్ చేశారు. వర్సిటీలో పూర్తయిన పరిశోధన గ్రంథాలను డిజిటల్ రూపంలో తీసుకువచ్చి శోధ్‌గంగ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ విభాగంలో ఏయూ మొదటి 10 స్థానాలలో ఒకటిగా నిలిచి చరిత్ర సృష్టించింది. అదే విధంగా పరిశోధన జర్నల్స్‌ను పరిశోధకులకు ఉపయుక్తంగా మలుస్తూ సోల్ 3.0 సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తూ ఒక క్లిక్‌తో కంప్యూటర్‌లో జర్నల్స్‌ను పొందే వెసులుబాటు కల్పించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా రూ. 50 లక్షలకు పైగా వెచ్చించి ఈ బుక్స్, జర్నల్స్ అందుబాటులో ఉంచారు.

ఈ–లెర్నింగ్ సెంటర్

గ్రంథాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న రీడింగ్ రూమ్, ఈ– లెర్నింగ్ సెంటర్లను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. రీడింగ్ రూమ్‌లో ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటు, నూతనంగా టాయిలెట్స్ నిర్మించారు. ఈ భవనం మొదటి అంతస్తులో డిజిటల్ లైబ్రరీ, ఈ–రిసోర్సెస్, ఈ–బుక్స్, ఈ–థీసెస్, ఈ–కంటెంట్‌ను అందుబాటులో ఉంచారు. భవనం రెండో అంతస్తులో అంతర్జాతీయ విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ–లెర్నింగ్ సెంటర్ సేవలు అందిస్తోంది.


ఈ-లెర్నింగ్ సెంటర్


గ్రంథాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బెంచీలు

విద్యార్థులకు ఉపయుక్తంగా..



విద్యార్థులకు ఉపయుక్తంగా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేశారు. దీంతో పాటు తాళపత్రాల డిజిటలైజేషన్, ఈ బుక్స్, ఈ జర్నల్స్‌ను విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. పరిశోధకుల కోసం జర్నల్స్‌ని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్, డాక్టర్ వి.ఎస్ కృష్ణా గ్రంథాలయం

ఆలయాలకు 'నూతన' శోభ


లలితపీఠంలో పూజలు చేస్తున్న పురోహితులు


విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి


ఎంవీపీ కాలనీలో అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఏయూక్యాంపస్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాలు కళకళలాడాయి. దేవాలయాలను విద్యుద్దీపాలతో, పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. లలితపీఠంలో ఉదయం నుంచి పరమేశ్వరుడికి అభిషేకాలు, లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈస్ట్ షిర్డీ ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. పోలమాంబ ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. నూతన సంవత్సరం అందరికీ శుభం జరగాలని కాంక్షిస్తూ పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు.

విశేష అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాలు నూతన సంవత్సర శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా మూలవిరాట్టులను విశేషంగా అలంకరించారు. వేంకటేశ్వర స్వామి గద, విల్లంబులతో విశ్వరూప అలంకరణలో, ప్రసన్న ఆంజనేయస్వామి వివిధ రకాల పండ్ల అలంకరణతో, సుబ్రహ్మణ్యస్వామి ఉభయ దేవేరులతో చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి జరిగిన గోష్ఠిలో 4 రకాల విశేష ప్రసాద పంపిణీ, తిరుప్పావై 17వ పాశురవిన్నపం నిర్వహించారు.


చందన అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ఆరిలోవ: నూతన సంవత్సరం సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి ఆంగ్ల సంవత్సరం ప్రారంభం కావడంతో మొదటి రోజు ప్రజలు దైవ దర్శనం చేసుకొన్నారు. విశాలాక్షినగర్, హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, తోటగరువు, బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ ఆదర్శనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లోని ఆలయాలను ప్రజలు సందర్శించి పూజలు, అభిషేకాలు చేశారు.

మద్దిలపాలెం : నూతన సంవత్సర వేడుకలను పాత వెంకోజీపాలెంలో గల సీతారామాలయం వద్ద సోమవారం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో భీమశెట్టి విశ్వనాథం, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


పెదగదిలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు


మేయర్ హరి వెంకటకుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీవీఎంసీ అధికారులు


ఆచార్య ప్రసాద రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విదేశీ విద్యార్థులు


అలుమ్ని కనెక్ట్ సంచిక ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం రాత్రి, సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో కోలాహలం నెలకొంది. నగర ప్రథమ పౌరురాలు గొలగాని హరి వెంకటకుమారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పలు వార్డుల కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరారు.

విద్యార్థులే వర్సిటీకి బ్రాండ్ అంబాసీడర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసీడర్లని ఏయూ మాజీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశీ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభిన్న దేశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఏయూ అందిస్తోందన్నారు. విదేశీ విద్యార్థుల వ్యవహారాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్, చీఫ్ వార్డెన్ సీహెచ్ ఆశా ఇమ్మానియేల్‌రాజు, వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం పాల్గొన్నారు.

- నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆచార్య ప్రసాద రెడ్డికి అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు, రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ శుభాకాంక్షలు తెలిపారు.

అలుమ్ని కనెక్ట్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తీర్చిదిద్దిన న్యూస్ లెటర్ 'అలుమ్ని కనెక్ట్'ని నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్థ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించే వివిధ కార్యక్రమాల సమాహారంగా దీనిని తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, పూర్వ అధ్యక్షుడు ఆచార్య బీల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.కుమార్‌రాజ, సంయుక్త కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, సభ్యులు డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, వగీర తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతకు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వర్సిటీ ప్రిన్సిపాళ్లు, అధికారులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్య జి.శశిభూషణరావు, పాలక మండలి సభ్యులు ఆచార్య పి.సునీత, ఆచార్య దుర్గారాణి, అకడమిక్ డీన్ ఆచార్య ఎ.కిషోర్ బాబు, ప్రవేశాల సంచాలకులు ఆచార్య డీఏ నాయుడు, దూరవిద్య సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్కులో మిరాకిల్ సొసైటీ వ్యవస్థాపకులు బ్రదర్ శామ్యూల్ కర్మోజీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర ఆరాధన సోమవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. సిస్టర్ శ్రేష్ఠ కర్మోజీ, సోహాస్ జోయెల్ కర్మోజీ గీతాలు ఆలపించారు.

మిజోరం గవర్నర్‌కు శుభాకాంక్షలు

మిజోరం గవర్నర్ కె.హరిబాబుకు దసపల్లా హిల్స్‌లోని ఆయన నివాసంలో నగరంలోని ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, జీవీఎంసీ జోన్ – 4 కమిషనర్ శివప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


ఇన్‌చార్జి వీసీ సమతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్


ఎంజీఎం పార్క్‌లో మిరాకిల్ ఆరాధనలో క్రైస్తవులు


మిజోరం గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మేడ పైనుంచి పడి వ్యక్తి మృతి

బీచ్ రోడ్డు: ప్రమాదవశాత్తు మేడ పైనుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లోని ఒక రెస్టారెంట్‌లో అసిస్టెంట్ కుక్‌గా పని చేస్తున్న గణేష్ దాసు(36) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం మేడ పైనుంచి ప్రమాదవశాత్తు కిందకి పడిపోయాడు. దీంతో అక్కడకక్కడే ఆయన మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడిది ఒడిశా రాష్ట్రం కాగా.. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి మండల శాఖ ఆధ్వర్యంలో 110 మంది ఉపాధ్యాయ యూనియన్ సభ్యులకు మండల శాఖ అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో జానకి సోమవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాటలు వేయాలని కోరారు. ఎంఈవోలు శివరాణి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ పథకాలు

మధురవాడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి చెప్పారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆమెని పలువురు సచివాలయ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకిత భావంలో పనిచేయాలని సూచించారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు అనీల్, సంతోష్, కళ్యాణి, ఉష, ప్రవద, జీవన్, బాలకృష్ణ, శ్రీనివాస్, రవీంద్ర పాల్గొన్నారు. మధురవాడలో పలు రాజకీయ పార్టీలు, కాలనీ, అపార్ట్‌మెంట్ కమిటీలు ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల యువత నూనత సంవత్సరానికి స్వాగతం... పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కేరింతలు కొట్టారు.


జెడ్సీ కనక మహాలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ అడ్మిన్లు

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

ఆరిలోవ: బీజేపీ నాయకులు సోమవారం అయోధ్య బలరాముని అక్షింతలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 9, 10 వార్డుల పరిధిలో జోడుగుళ్లపాలెం, ఆదర్శనగర్‌లో బలరాముని పల్లకీ ఊరేగించి వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అంక్షింతలు అందించారు. జోడుగుళ్లపాలెంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర స్థానిక నాయకులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో నిర్మిస్తున్న భవ్య రామమందిరం ఈ నెల 22న ప్రారంభంకానుందన్నారు. దీంతో హిందువుల కల నెరవేరనుందన్నారు. అయోధ్యలో బలరాముని స్పర్శ అంక్షింతలతోపాటు ఈ నెల 22న జరగనున్న ప్రారంభోత్సవంలో స్వామి ప్రతిమ, విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సుజాత, జిల్లా కార్యదర్శి ధనేశ్వరరావు పాల్గొన్నారు.


జోడుగుళ్లపాలెంలో ఊరేగిస్తూ అక్షింతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు